క్లుప్తంగా

ఉపాధి పనుల పరిశీలన



ఉపాధి పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ నాగ మహేశ్వరరావు

రాజమహేంద్రవరం రూరల్: ఉపాధి హామీ పనుల ఆకస్మిక తనిఖీలో భాగంగా జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు (డ్వామా) డైరెక్టర్ నాగ మహేశ్వరరావు శుక్రవారం వెంకటనగరం గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మస్తర్లను పరిశీలించి, ఉపాధి పనులు చేస్తున్న కూలీలతో మాట్లాడారు. కనీస వేతనం, ఫస్ట్ ఎయిడ్ కిట్స్, పని ప్రదేశంలో నీడ కోసం మాట్లాడి పెండింగ్‌లో ఉన్న వేతనాలు త్వరలో పడతాయని తెలిపారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఏపీవో అంజిబాబు ఉన్నారు.

ట్రాన్స్‌జెండర్ల హక్కులపై సదస్సు



ట్రాన్స్‌జెండర్ల సదస్సులో పాల్గొన్న అధికారులు

కంబాలచెరువు: స్థానిక జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌జెండర్ల హక్కులు, సమస్యలపై పర్మనెంట్ లోక్ అదాలత్ చైర్మన్ ఏ.గాయత్రిదేవి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మి అవగాహన కల్పించారు. శ్రీలక్ష్మి మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్లకు భారత రాజ్యాంగం ద్వారా, సుప్రీం కోర్టు ఆదేశాల ద్వారా హక్కులు ఉన్నాయన్నారు. వారిపై ఎవ్వరూ వివక్ష చూపరాదన్నారు. ఆ హక్కులను వినియోగించుకుని అభివృద్ధి సాధించాలన్నారు. స్వయం ఉపాధికి అందుబాటులో ఉన్న సబ్సిడీలపై అవగాహన కల్పించారు. ఈ విషయంలో ఎలాంటి సహకారం కావాలన్నా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అండగా ఉంటుందన్నారు. సదస్సులో సెంట్రల్ జోన్ డీఎస్పీ కె.రమేష్ బాబు, అసిస్టెంట్ సివిల్ సప్లయ్ ఆఫీసర్ తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్‌ది ముమ్మాటికీ హత్యే



మాజీ ఎంపీ హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ: పాస్టర్ ప్రవీణ్‌ది నూరు శాతం హత్యేనని, అసలు ప్రవీణ్‌ను మాయం చేసి ఫేక్ ప్రవీణ్‌ను ప్రవేశపెట్టారని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ అన్నారు. రాజమహేంద్రవరంలోని తన నివాసంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పాస్టర్ ప్రవీణ్ పడగాల ప్రమాదవశాత్తూ మృతి చెందాడని పోలీసులు దర్యాప్తు అనంతరం ప్రకటించిన విషయాన్ని ఎవరు నమ్మడం లేదన్నారు. ఐజీ అశోక్ కుమార్ ప్రెస్‌మీట్ నిర్వహించి ప్రవీణ్ ప్రమాదవశాత్తూ మృతి చెందాడని ప్రకటించి వారం రోజులు అవుతుందన్నారు. ఇప్పటి వరకూ పోస్టుమార్టం నివేదిక ఇవ్వడంలో ఆలస్యం ఏమిటో అర్థం కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కేసులో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. తన దగ్గర ఉన్న పోస్టుమార్టం రిపోర్టులో ఆయన శరీరంపై మొత్తం 18 గాయాలు ఉన్నట్లుగా పేర్కొన్నారన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో ఐజీలు, ఐపీఎస్ అధికారులు ప్రభుత్వానికి బానిసలుగా మారిపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాస్టర్ ప్రవీణ్ చనిపోయిన ప్రదేశంలో శనివారం సాయంత్రం కొవ్వొత్తులతో నివాళులర్పిస్తానని ప్రకటించారు.

సినిమాలు



శ్యామల	: గుడ్‌బ్యాడ్‌అగ్లీ
సూర్యమినీ	: జాట్
సూర్యప్యాలెస్	: జాక్
స్వామి	: ఓదెల–2
శివజ్యోతి	: అర్జున్ సన్‌ఆఫ్ వైజయంతి
అనుశ్రీ	: అర్జున్ సన్‌ఆఫ్ వైజయంతి
రాజా	: ఓదెల–2
ఊర్వశి	: మ్యాడ్ స్క్వేర్
మేనక	: మధురం, డియర్ ఉమ
రంభ	: అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి
కుమారి	: ఓదెల–2
అప్సర	: అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి
అశోక	: అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి
నామవరం	
వీఎస్ మహల్	: అర్జున్ సన్‌ఆఫ్ వైజయంతి
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: అర్జున్ సన్‌ఆఫ్ వైజయంతి
కడియం	
వెంకటసూర్య	: అర్జున్ సన్‌ఆఫ్ వైజయంతి

ఆటవిడుపు

- వేసవిలో క్రీడా శిక్షణ తరగతులు
- మే ఒకటి నుంచి ప్రారంభం
- 50 కేంద్రాల ఏర్పాటుకు చర్యలు

ప్రకాశం నగర్: ఇప్పటి వరకు చదువులతో కుస్తీ పట్టిన బాలలకు వేసవిలో ఆటవిడుపు లభించనుంది. వారికి వివిధ రకాల క్రీడల్లో శిక్షణ ఇచ్చేందుకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. ఒక కేంద్రంలో కనీసం 25 మంది బాలురు, 25 మంది బాలికలకు శిక్షణ ఇస్తారు. ఎనిమిదేళ్ల నుంచి 14 ఏళ్ల వయసున్న వారికి ఈ అవకాశం ఉంటుంది.

పలు రకాల క్రీడల్లో..

క్రికెట్, వాలీబాల్, ఫుట్‌బాల్, ఖోఖో, హాకీ, కబడ్డీ, హ్యాండ్ బాల్, టెన్నిస్, యోగా, బాక్సింగ్, షటిల్ బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ తదితర అంశాలలో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ శిబిరాల నిర్వహణకు జిల్లా క్రీడా అసోసియేషన్లు, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడా శిక్షకుల నుంచి దరఖాస్తుల ఆహ్వానించారు. అర్బన్, రూరల్ నియోజకవర్గాల్లో 50 సెంటర్లకు తగ్గకుండా శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ముఖ్య క్రీడా శిక్షకులు డీఎంఎం శేషగిరి తెలిపారు.



ఎస్‌కేవీటీ మైదానంలో బాక్సింగ్‌లో శిక్షణ తీసుకుంటున్న విద్యార్థినులు (ఫైల్)

నెల రోజుల పాటు శిక్షణ

మే ఒకటి నుంచి 31వ తేదీ వరకూ సుమారు నెల రోజుల పాటు శిక్షణ తరగతులు జరుగుతాయి. దీని ఘనంగా నిర్వహించేందుకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఏర్పాట్లు చేస్తోంది. వీటికి ఈ నెల 17వ తేదీతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగిసింది. ఇకపై క్రీడా మైదానాల ఎంపిక, ఆయా శిబిరాల్లో శిక్షణ ఇచ్చేందుకు క్రీడా శిక్షకుల పరిశీలన మిగిలి ఉంది.



ఫుట్‌బాల్‌లో శిక్షణ పొందుతున్న చిన్నారులు (ఫైల్)

సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. క్రీడల్లో ప్రతిభ కనబరించేందుకు ఈ శిబిరాలు క్రీడాకారులకు ఎంతగానో ఉపయోగపడతాయి. నచ్చిన ఆటలో మెలకువలు నేర్చుకునేందుకు చక్కటి అవకాశం. – డీఎంఎం శేషగిరి, జిల్లా చీఫ్ కోచ్



నగదు, బంగారం చోరీ

సీతానగరం: మండలంలోని ముగ్గళ్లకు చెందిన కూచిపూడి సతీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దొంగతనం కేసు నమోదు చేశామని ఎస్సై డి.రామ్ కుమార్ శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సతీష్ తన తల్లితో పాత ఇంటి వద్ద ఉంటున్నాడు. రాజమహేంద్రవరం వెళ్లే పని ఉండటంతో శుక్రవారం ఉదయం 4 గంటలకు కొత్త ఇంటికి వెళ్లాడు. మెయిన్ గేటు తాళం తీసి లోపలికి వెళ్లగా మెస్ తాళంతో పాటు గది తాళం పగులకొట్టి ఉంది. లోపలకు వెళ్లి చూడగా, బీరువాలోని దుస్తులు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. రూ. 20 వేలు, 8 గ్రాముల బంగారు సూత్రాలు, 20 గ్రాముల వెండి వస్తువులు, గ్యాస్ సిలిండర్ పోయినట్లు గుర్తించారు. అలాగే పక్కనే ఉన్న చిన్న నాన్నమ్మ మిర్తిపాడు వెళ్లగా ఆ పోర్షన్ తాళాలు బద్దలు కొట్టి ఉన్నాయి. అక్కడ 30 గ్రాముల వెండి పూజాసామగ్రి, రూ 5 వేలు పోయినట్లు గుర్తించారు.

ఉత్సాహంగా బ్యాంకు ఉద్యోగుల క్రీడా పోటీలు

రాజమహేంద్రవరం సిటీ: అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య 80వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా బ్యాంకు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 12 నుంచి 18వ తేదీ వరకూ నిర్వహించిన క్రీడా పోటీలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా సమాఖ్య జిల్లా కార్యదర్శి ఎస్.లక్ష్మీపతిరావు మాట్లాడుతూ బ్యాంకు ఉద్యోగులకు క్రికెట్, చెస్, క్యారమ్స్, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించామన్నారు. వీటిలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, కో – ఆపరేటివ్ బ్యాంకుల ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు. విజేతలకు ఈ నెల 20వ తేదీన జరిగే వ్యవస్థాపక దినోత్సవంలో బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. 1969లో జరిగిన బ్యాంకుల జాతీయకరణలో అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య ప్రముఖ పాత్ర పోషించిందన్నారు. గత 79 ఏళ్లుగా బ్యాంకు ఉద్యోగులకు 12 వేతన ఒప్పందాలను మెరుగు పరచడానికి ఎంతో కృషి చేసిందన్నారు. కార్యక్రమంలో యూనిట్ నాయకులు శ్రీనివాస్, రమేష్, మురళీధర్, సూర్య, అప్పారావు, వెంకటేశ్వరరావు, శివరామకృష్ణ, కామేశ్వరరావు పాల్గొన్నారు.



క్యారమ్స్ పోటీలో తలపడుతున్న బ్యాంకు ఉద్యోగులు

కార్మిక సమ్మెను జయప్రదం చేయాలి

ప్రకాశం నగర్: కార్మిక హక్కులను హరించే లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్‌తో దేశ వ్యాప్తంగా మే 20న జరిగే కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ఉమా మహేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో జిల్లా స్థాయి సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ఉమామహేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. లేబర్ కోడ్స్‌పై పుస్తకాన్ని సీఐటీయూ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ మే 20 దేశవ్యాప్తంగా 11 కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కార్మిక సమ్మె జరుగుతుందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. పైకి మాత్రం చట్టాల ఆధునీకరణ చేస్తున్నామని పేరుతో 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్ పేరుతో బ్రిటిష్ కాలం నుంచి కార్మికుల పోరాడి సాధించుకున్న హక్కులను హరించే కుట్ర చేస్తుందన్నారు. అనంతరం జరిగిన కార్యవర్గ సమావేశంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బి.పవన్‌ను జిల్లా నాయకత్వం ఏకగ్రీవంగా ఎన్నుకుంది. సమావేశంలో ఎస్ఎస్ మూర్తి, ఎం.సుందర్ బాబు, కేఎస్‌వీ రామచంద్రరావు, టి.అరుణ్, కె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



లేబర్ కోడ్స్‌పై పుస్తకాన్ని విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

సంతానోత్పత్తిపై ఆందోళన వద్దు

కంబాలచెరువు: జంటలు సంతానోత్పత్తిపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే అనుకున్న ఫలితాలు సాధించవచ్చని ప్రముఖ ఫెర్టి9 సంతానోత్పత్తి వైద్యులు డాక్టర్ అశ్విని ఉయ్యూరి, డాక్టర్ సౌమ్యా వరుదు అన్నారు. సంతానోత్పత్తిపై సలహాలు, సూచనలు కల్పించేందుకు జయశ్రీ గార్డెన్స్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రస్తుత జంటల్లో సంతానోత్పత్తిపై ఎక్కువ శాతం ఆందోళన నెలకొందని, సరైన పద్ధతి అవలంబిస్తే ఆ సమస్య నుంచి గట్టెక్కవచ్చన్నారు. అలాంటి వారికి సంపూర్ణ విధానం ద్వారా శాస్త్రీయంగా వారి మానసిక, శారీరక స్థితులను అంచనా వేసి సంతానోత్పత్తి చికిత్సను అందించనున్నట్లు పేర్కొన్నారు. రాజమహేంద్రవరంలోనే ఇలాంటి ప్రపంచ స్థాయి చికిత్సా విధానం అందుబాటులో ఉందన్నారు. అనంతరం మహిళలు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు.



అవగాహన కల్పిస్తున్న వైద్యులు అశ్విని, సౌమ్య

వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధం

- ముస్లింల హక్కులకు విఘాతం
- ఆస్తులను కార్పొరేట్లకు దోచిపెట్టేందుకు కేంద్రం కుట్ర
- ముస్లిం ఐక్య వేదిక భారీ ర్యాలీ

సీటీఆర్ఐ: వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధమని, దీని వల్ల ముస్లింల హక్కులకు భంగం వాటిల్లుతుందని రాజమండ్రి ముస్లిం ఐక్య వేదిక పేర్కొంది. ఆ సవరణను నిరసిస్తూ శుక్రవారం ఆజాద్ చౌక్ నుంచి ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగరంలోని అన్ని మసీదులకు చెందిన ముస్లిం యువకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ హబీబుల్లాఖాన్ మాట్లాడుతూ ముస్లింల పూర్వీకులు దేవుని పేర దానం చేసిన భూములను కబళించి, కార్పొరేట్లకు దోచి పెట్టేందుకు కేంద్రం వక్ఫ్ చట్టం పేరుతో కుట్ర చేస్తోందని విమర్శించారు. ముస్లింల అభివృద్ధి కోసం ఈ చట్టం తెస్తున్నామంటున్న బీజేపీ.. గత పదేళ్లుగా ఒక్క ముస్లింకి కూడా మంత్రి పదవి ఎందుకివ్వలేదు అంటే సమాధానం లేదని ఎద్దేవా చేశారు. కొత్త చట్టం ద్వారా తీసుకొచ్చిన ప్రతి మార్పు ముస్లింలకు వ్యతిరేకమని, వక్ఫ్ బోర్డును బలహీన పరిచేదేనని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ చట్టాన్ని వెనక్కి తీసుకునేదాకా పోరాడతామని హెచ్చరించారు. కో కన్వీనర్ అహ్మద్ అన్సర్ మాట్లాడుతూ లిమిటేషన్ చట్టాన్ని వర్తింపచేయడం ద్వారా అన్యాక్రాంతమైన లక్షలాది ఎకరాల భూములను శాశ్వతంగా కోల్పోతామన్నారు. కోల్పోయిన భూములను చంద్రబాబు ఎలా తెచ్చిస్తారో చెప్పాలని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎండీ అన్సర్, కె.సల్మాన్, ఎండీ అక్రమ్, ఎండీ ఆరిఫ్ ఉల్లాఖాన్, కలీం, సైఫ్, అమీర్ తదితరులు పాల్గొన్నారు.



రాజమహేంద్రవరంలో ర్యాలీ చేస్తున్న ముస్లిం యువత

ప్రభుత్వాసుపత్రిని ప్రక్షాళన చేశాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

కంబాలచెరువు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పది నెలల్లో ప్రభుత్వాసుపత్రిని ప్రక్షాళన చేసి ఒక దారికి తెచ్చామని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. కూటమి నాయకులతో కలిసి ఆయన శుక్రవారం ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఒక నోడల్ అధికారిని నియమించేలా చేశామన్నారు. బకాయిల కారణంగా ఎక్కడా ఎన్టీఆర్ వైద్య సేవలు ఆగలేదన్నారు. రోజూ 1500 మంది ప్రభుత్వ ఆసుపత్రిలో ఓపీ వైద్య సేవలు పొందుతున్నారన్నారు. సీఎస్ఆర్ నిధులు ఇప్పటికే పేపరు మిల్లు నుంచి రూ. కోటి 20 లక్షలు వచ్చాయని, మరో రూ.40 లక్షలు రానున్నాయన్నారు. మెడికల్ ఉద్యోగాలు పారదర్శకంగా వేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జనసేన సిటీ ఇన్‌చార్జి అత్తి సత్యనారాయణ, జిల్లా బీజేపీ అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ ఊసరవెల్లి దత్తుడు

- స్క్రిప్ట్ చదివే ముందు చూసుకుంటే మంచిది
- విమర్శలు చేస్తే ఊరుకునేది లేదు
- మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి ఆగ్రహం



మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: కరకుదురు దత్తుడు రాజకీయ ఊసరవెల్లి అని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి విమర్శించారు. అనపర్తిలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తనపైనా, తన కుటుంబంపైనా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అనేక విమర్శలు చేశారన్నారు. వాటిని ఖండిస్తూ తాను చేసిన వ్యాఖ్యలపై చాలా మందితో విమర్శలు చేయిస్తున్నారని ఎద్దేవా చేశారు. తాను చెప్పేవి వాస్తవాలని, వాటిపై వెనక్కి తగ్గబోనని స్పష్టం చేశారు. ఈ నెల 17న పెదపూడి మండలం కరకుదురు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ దత్తుడు వ్యక్తిగత స్వలాభం కోసం ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి రాసిన స్క్రిప్ట్‌ను చదివారన్నారు. ఆయనపై ఎవరు అక్రమ కేసులు పెట్టారని ప్రశ్నించారు. ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీతోనే వెళ్లాలనుకోవడం సరికాదన్నారు. దత్తుడు రాజకీయ ఊసరవెల్లి అని వ్యాఖ్యానించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో అనపర్తి నియోజకవర్గంలో ఎన్డీఏ కూటమి తరఫున, కాకినాడ వెళితే అక్కడ ఒక వార్డులో వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జిగా, రామచంద్రపురం వెళితే అక్కడ ఇంకోపార్టీ పెద్ద మనిషిగా చలామణి అవుతున్నారు, మీకు సిగ్గులేదా అని విమర్శించారు. సంక్రాంతి సందర్భంగా కోడిపందేలు, గుండాటకు వసూలు చేసిన లక్షల రూపాయలు మీ నాయకుడి దగ్గర ఉన్నాయా, లేక మీ వద్దే ఉన్నాయా అని విమర్శించారు.

రేపు చదరంగం పోటీలు

ప్రకాశం నగర్: జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో ఆదివారం అండర్ -9 విభాగంలో బాల బాలికల చదరంగం పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సంఘ కార్యదర్శి జీవీ కుమార్ తెలిపారు. ఆసక్తి కలవారు శనివారం సాయంత్రం లోపు 98483 74133 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఉపాధి కూలి ఎగ్గొట్టేందుకు కూటమి కుట్ర



కాపవరంలో ఉపాధి కూలీల వేతనాల కోసం ఆందోళన చేస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

కోరుకొండ: ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు వేతనాలివ్వకుండా ఎగ్గొట్టేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.ప్రదీప్ అన్నారు. మండలంలోని కాపవరంలో శుక్రవారం ఉపాధి కూలీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదీప్ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే రూ.1,50,000 కోట్లు అప్పుచేసిన సీఎం చంద్రబాబు.. కూలీల మూడు నెలలకు సంబంధించిన వేతనాలు ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. అమరావతి నిర్మాణం కార్పొరేట్ కంపెనీలు, పెట్టుబడిదారులకు ఉపయోగకరమని, పేద వర్గాలకు ఒరిగిందేమీ ఉండదన్నారు. ఎన్నికల్లో సూపర్ సిక్స్‌తో కలిపి, 176 హామీలిచ్చి, ఏమీ అమలు జరపని ఘనత చంద్రబాబుకు దక్కుతుందన్నారు. సమావేశంలో పలువురు కూలీలు మాట్లాడుతూ వేసవి ఎండలు మండిపోతున్నా సౌకర్యాలు కల్పించడం లేదన్నారు.

దొర్లంబికా అమ్మవారి తీర్థం

పెదపూడి: అనపర్తి మండలం దుప్పలపూడి గ్రామంలో కొలువైన దొర్లంబికా అమ్మవారి తీర్థం శుక్రవారం ఘనంగా జరిగింది. అమ్మవారిని వైఎస్సార్ సీపీ నియోజకవర్గం కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. వారికి వైఎస్సార్ సీపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో వల్లభశెట్టి శ్రీను, వెలగల నాగిరెడ్డి, నందికోళ్ల శ్రీను, ఆశీర్వదం, సీహెచ్ శ్రీను, వల్లభశెట్టి శ్రీను, వి.చంద్రశేఖర్, జంపా రాజు, నాని తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నూకాలమ్మ తీర్థం

రాజానగరం: మండలంలోని సీతారామపురంలో గ్రామ దేవత నూకాలమ్మ తీర్థం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ విజ్ఞప్తి మేరకు ఉత్సవ విగ్రహాన్ని అందజేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామంలోని కొన్ని పేద కుటుంబాలకు 20 కిలోల బియ్యాన్ని, భజన బృందంలోని మహిళలకు పట్టు చీరలను పంపిణీ చేశారు.

ఏసుక్రీస్తుతో మానవులకు రక్షణ

- పాపుల విముక్తి కోసమే సిలువ మరణం
- పాస్టర్ల వాక్యసందేశం
- భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు



మాట్లాడుతున్న రెవరెండ్ డాక్టర్ విజయరాజు



సిలువపై ఏసుక్రీస్తు పలికిన మాటలను వివరిస్తున్న జాన్ వెస్లీ



దామిరెడ్డిపల్లి బైబిలు మిషను మహిమ మందిరంలో ప్రార్థనలు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): గుడ్ ఫ్రైడే పర్వదినాన్ని క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఏసుక్రీస్తు పడిన శ్రమలను గుర్తు చేసుకుని ప్రార్థనలు చేశారు. రాజమహేంద్రవరంలోని కేథడ్రాల్, శానిటోరియంలోని బైబిల్ మిషన్ స్వస్థతశాలలో ప్రార్థనలు జరిపారు. ఈ సందర్భంగా బైబిల్ మిషన్ ప్రెసిడెంట్ రెవరెండ్ డాక్టర్ ఎన్.విజయరాజు మాట్లాడుతూ మానవుల పాపాల విముక్తి కోసం ఏసుక్రీస్తు సిలువలో శ్రమపడి మరణించారన్నారు. ఆయన ద్వారానే మానవులకు రక్షణ సాధ్యమని అన్నారు. క్రైస్తవ విశ్వాసులు అధిక సంఖ్యలో పాల్గొని, ఏసుక్రీస్తు సిలువ పాటలు, సన్నిధి క్రమాలు, వాక్యపఠనంతో సిలువను ధ్యానించారు. విజయరాజు ప్రసంగిస్తూ దేవ కుమారుడుగా ఏసుక్రీస్తు ప్రభువు ఈ లోకానికి వచ్చి 33 ఏళ్ల ఆరు నెలలు జీవించి, శ్రమలు పొంది సిలువపై మరణించారన్నారు. అనంతరం మూడో రోజున సమాధిని జయించి పునరుత్థానుడై తిరిగి లేచి దేవ కుమారునిగా అందరికీ ప్రత్యక్షమయ్యారని చెప్పారు. కార్యక్రమంలో ఎన్.సిమ్యోన్ సుదర్శన్, ఎన్.విలియం బెంటిక్, ఎన్.ఉషారాణి పాల్గొన్నారు.

బొమ్మూరులో..

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని క్రైస్ట్ లూథరన్ చర్చిలో పేరిష్ పాస్టర్ రెవరెండ్ కె.అబ్బలేము ఆధ్వర్యంలో గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు జరిగాయి. ఆయన మాట్లాడుతూ లోక ప్రజలను రక్షించడానికి ఏసుక్రీస్తు శిక్షించబడి, సిలువ యాగంలో బలి అయ్యి మరణించి, విజయం పొందారన్నారు. పలువురు క్రైస్తవులు ఉపవాసంతో దేవుని ప్రార్థించారు. సంఘ పెద్దలు, స్త్రీల సమాజం, యూత్, సండే స్కూల్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఆరాధన

రాజమహేంద్రవరం సిటీ: సుబ్బారావు నగర్‌లోని క్రైస్ట్ వర్షిప్ సెంటర్‌లో ప్రత్యేక ఆరాధన నిర్వహించారు. ప్రారంభ ప్రార్థన పాస్టర్ జాన్ పీటర్ చేయగా, ఏసుక్రీస్తు సిలువలో పలికిన ఏడు మాటల్లో చేసిన త్యాగం, ప్రేమ గురించి వివరించారు.

దామిరెడ్డిపల్లిలో..

కడియం: దామిరెడ్డిపల్లి బైబిలు మిషను మహిమ మందిరం దేవరపల్లి రత్నరాజు ఆధ్వర్యంలో గుడ్‌ఫ్రైడే ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మానవుల పాప పరిహారార్థం ఏసుక్రీస్తు సిలువపై తను రక్తాన్ని చిందించారన్నారు. కార్యక్రమంలో దేవరపల్లి సరోజిని, స్వాతి, శ్యామల, సంధ్య, పరిమళ పాల్గొన్నారు.

ధవళేశ్వరంలో..

ధవళేశ్వరం: గుడ్‌ఫ్రై డే సందర్భంగా ధవళేశ్వరం గ్రామంలోని పలు చర్చిల్లో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానిక ఎన్ఎంఆ చర్చిలో ఉదయం నుంచి ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఈ సందర్భంగా పలువురు క్రీస్తు సందేశాలను అందించారు. గుడ్‌ఫ్రైడే విశిష్టతను వివరించారు. ఏసుక్రీస్తు చూపిన శాంతి మార్గంలో అందరూ పయనించాలన్నారు.



బొమ్మూరు క్రైస్ట్ లూథరన్ చర్చిలో గీతాలాపన చేస్తున్న సండే స్కూలు చిన్నారులు



ధవళేశ్వరం ఎన్ఎంఆ చర్చిలో ప్రార్థనలో పాల్గొన్న క్రైస్తవులు